# సన్మానము చూతము రారండి!

- ఎనుగంటి వేణుగోపాల్

"పుర్రెకో బుద్ధి జిహ్వకో రుచి" అంటుంటారు. నిజంగా నిఝమేనేమో! గోపాలం బుజ్జి బుర్రకో బుద్ధి పుట్టింది. విపరీత బుద్ధి. వింతల్లోకెల్లా వింతేం కాకపోయినా అతగాడి భార్య కామెడీగా 'ఔరా!' అని బుగ్గ నొక్కుకుందంటే మనబోటి వాళ్ళం ఆలోచించాల్సిందే మరి.

ఆస్కార్ అవార్డ్ కొట్టేయాలని ఉవ్విళ్ళూరి పోలేదతను. ఆ ఛాటొస్తే నిఝంగానే కొట్టుకొచ్చేసేవాడు. వెరీ టాలెంటెడ్. మ్యాటర్ అది కాదు.

బిల్‌గేట్స్ పక్కన పేరుంటే బావుండునని హాస్యానిక్కూడా కోరుకోలేదు. అలాగైతే స్విస్‌బ్యాంకుకో, ప్రపంచ బ్యాంకుకో రాత్రికిరాత్రే కన్నం ఖరారుచేసేవాడు. టూ మచ్ స్పాంటేనియస్.

మరేంటంటారా... 'గొప్పగా' సన్మానం చేయించుకోవాలని తెగ ఉబలాటపడిపోతున్నాడు. సత్కారం స్వీకరించాలని సరదాపడిపోతున్నాడు. అదండీ గోపాలాని కంటిన విచిత్ర మాయ రోగం.

ఆ పిచ్చి సెగ తగిలిన మరునిమిషం ఎక్కడెక్కడ సన్మాన- సత్కార కార్యక్రమాలు జరిగిపోతున్నాయి... అక్కడ కూడా మాటేస్తున్నాడు.

ఒక రోజుండబట్టలేక ఉబ్బాపుకోలేక సిగ్గువిడిచి ఓ స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి కరివేపాకు కనకయ్యగారిని సంప్రదించాడు.

ఏకంగా 'బీజింగ్'కెల్లి నాకో పసిడి పతకం పారెయ్యరూ అనడిగినంత వెడ్డిగా "నాకొక సన్మానం చేయరూ?" అనడిగాడు.

కనుబొమ్మలు కథాకళిలా ఆడిస్తూ కనకయ్య పగలబడి నవ్వాడు.

"నేనేం జోక్ చేయలేదే?" 'వైట్'గా ఫేసెట్టాడు గోపాలం.

"నవ్వరా మరి. నన్ను సైకలాజిస్ట్‌ని చేస్తోంటే..."

'నేను సైకోనేం కాదు. మీరు 'సన్మానా లిస్ట్' అని తెలిసే వచ్చా."

బుంగమూతి పెట్టాడు.

'ఎవరెందులో ప్రతిభావంతులో గాలం వేసి మేమే పట్టేస్తాం. హెవర్ని సన్మానించాలో డిసైడ్ చేసేస్కుంటాం. మీరేంటి? సన్మానం కావాలని ఎదురడిగేస్కుంటున్నారు. బల్లే... బల్లే..." పంజాబీ డాన్సర్‌లా రెండు చేతులూ పైకెత్తి కూర్చున్న చోటే మూవ్‌మెంట్సిచ్చి భళ్ళున నవ్వాడు కనకయ్య.

ఫెవికల్ పూసినట్టు గోపాలం మూతి సర్రున బిగుసుకుపోయింది.

బేలగా మొహం వేలాడేసుకున్న గోపాలం వంక జాలిగా చూస్తూ "తుపాల్‌లెండీ.. ముచ్చటపడి అడుగుతున్నారుగా, సన్మానం చేసే విషయం ఆలోచిద్దాం గానీ... లైఫ్‌లో మీరు చేసిన సూపర్‌మాన్ సాహసాలో, స్పైడర్‌మాన్ వింతలో ఏవైనా ఉంటే మీ మైండ్, వెబ్‌సైట్ నుండి లాగి చెప్పేసేయండి." కొంత కరిగాడు మా మంచి కార్యదర్శి.

"ఏం చెప్పాలా?" అని మనవాడు సీరియస్ ఫోజెట్టాడు.


గోపాలం 'రిస్ట్‌వాచ్ టైమ్' బావుండి చప్పున గుర్తొచ్చింది.

"అయిదో క్లాసులో స్కూల్ ఫస్టొచ్చాను." మెలికలు తిరుగుతూ చెప్పాడు.

"మా తండ్రే... భారతరత్నే ఇవ్వాల్సింది. ప్చ్! మిస్సయ్యారప్పుడు," లేచి లెంపకాయ పగులకొట్టాలన్నంత మండింది కనకయ్యకు. ఓపిక అతడి మారుపేరు కాబట్టి సరిపోయింది.

గోపాలం మొహం పీచుమిఠాయి అంత అయ్యింది.

"ప్లీజ్... ప్లీజ్... కాదనకండి. నావి చేతులు కాదు కాళ్ళనుకోండి. ఛీఛీ! మీవి చేతులు కావు కాళ్ళనుకోండి." అంటూ సెంటిమెంట్ ముడేసాడు.



చిక్కుకున్నాడు కనకయ్య.

"సర్సర్లెండి. మీరు "టూమచ్"గా అడుగుతున్నారు కాబట్టి... 'వన్‌మచ్' అడ్జస్ట్‌మెంట్... గయుడిని వెనకేసుకొచ్చిన అర్జునయ్యలా అభయమిచ్చాడు.

ఒలంపిక్ క్రీడోత్సవాల జ్యోతిలా మొహం వెలిగిన గోపాలం "చెప్పండి చెప్పండి" అన్నాడుత్సాహంగా.

"వెంఠనే పరుగెత్తి ఏదైనా "ఘనకార్యమో, ద్రవ' కార్యమో చేసి చావండి. అలా చేసే చూపండి."

"ఓ పన్చేయండి. ఎంచక్కా అడ్వాన్స్‌డ్ సన్మానం చేసేసుకోండి. ఆ తర్వాత నా వీర టాలెంట్ నిరూపిస్తా."

"అబ్బా! ఆశ, ఆసియన్ దోశ. మేమట్టాంటోళ్ళం కానే కాము."

"అలాగైతే రెడీగా ఉండండి. సన్మానానికి సన్నాహాలు చేసుకోని." హుషారుగా ఈలేసి అక్కడినుండి గబుక్కున మాయమైపోయాడు.

* * *

సరదాగా రోడ్డుమీద షికారేస్తుంటే సువార్తలా వినపడింది గోపాలానికి.

"రండి... పందెం కాయండి..." అని ఆత్రంగా దూసుకెళ్లాడక్కడికి.

"ఈ సైకిల్‌ని వెనక్కి తొక్కాలి. ఎవరు ఎక్కువ స్లోగా ఈ పన్చేస్తారో వాళ్ళదే గెలుపు. రండి, రికార్డ్‌ని రికార్డ్ చేయండి. గెలుపుబాట పట్టండి. రివార్డ్ నొక్కేయండి. విజేత... మీరు మీరు ఎవరైనా కావచ్చు." గుమిగూడిన జనాల వైపు వేలెట్టి చూపుతూ ఊరిస్తోంది జానాబెత్తెడు గుడ్డలేసుకున్న ముద్దుగుమ్మ.

"విజేత... చిరంజీవి కదా? మేమెలా అవుతాం?" భలేగా అడిగాడు గోపాలం.

"చిరంజీవి సైకిల్‌ని ముందుకి తొక్కాడు. మీరు వెనక్కి కాబట్టి గెలిచినవారే విజేత." గడుసుగా అందా అమ్మాయి.

"బాగా చెప్పావమ్మా!" చొంగ కారుస్తూ కనెప్పలు గిలపకుండా ఆమె సరుకుల్ని చూపుల్తో కాపాడుకుంటున్న గుంపులో తాతయ్యరిచాడు.

భేతాళ సందేహం తీరిన గోపాలం ఆగలేక పోయాడిక.

వరించి వచ్చిన దాన్నెలా వదిలిపెడతాడు. సన్మానం రా రామ్మని పిలుస్తూ ఊరిస్తుంటే రంగంలోకి దుమికాడు. ఎవరో ఆకతాయి కాలు అడ్డం పెట్టాడు. బొక్కాబోర్లా పడ్డాడు గోపాలం. ఏమవలేదు కానీ దవడ పండ్లు కాస్త బెణికాయంతే.

సైకిల్లిచ్చి 'స్టార్ట్' అంటూ విజిల్ వేయకుండా కన్నుగీటిందా ముద్దుగుమ్మ.

అయిదుగురికొక బ్యాచ్ చొప్పున నాల్గు బ్యాచెస్ పూర్తయ్యాయి.

తెల్గు సినిమాలు తెగ చూసేసిన అనుభవంతో మీరూహించింది నిఝమే మరి. గ్రేట్ గోపాలమే విన్! విన్! విన్!

అంతా జేజేలు పలికారు. గోపాలం ఫేసు చూడాలిక. మనవాడు కలర్‌ఫుల్ మేఘాల్లో తేలిపోసాగాడు.

తన గెలుపుకి తనే తబ్బిబ్బైపోతూ "ఇది వరల్డ్ రికార్డా?" క్యూరియాసిటీగా అడిగాడు గోపాలం.

కిసుక్కున నవ్వి "హబ్బే! ఛానెల్ రికార్డ్" అందా అందాల చెమ్మచెక్క.

"అంటే ఇది..."

"య్యా! 'రండ్రండి... మిమ్మల్ని ఫూల్స్ చేస్తాం' ప్రోగ్రామ్‌కి ప్రాక్టికల్ పార్టన్నమాట. నెక్స్ట్ సండే టెలికాస్టవుతుంది." అందా భామ వయ్యారంగా అతగాడి చేతిలో ఓ గిఫ్ట్ పాకెటెడుతూ.

ఇంతోటి ప్రోగ్రామ్‌కంత బిల్డప్పా. హు! అని ఒగరుస్తూ సెకన్లో అక్కడి నుండి 'హాంఫట్' అన్నట్టు గాయబ్ అయిపోయాడు.

"ఇలాంటి ప్రోగ్రామ్‌లో గెలిస్తే సన్మానమెక్కడ జరుగుద్ది? మరోటి ట్రై చేద్దాం" అనుకున్నాడు గోపాలం.

* * *

"మా రికార్డ్‌ని బ్రేక్ చేయాలనుకుంటున్నారా?"

"బడా బడా షామియానాలు ఏర్పరచినచోట జనం గుమిగూడి ఉన్నారు. వేదికపై మైకు ముందు నిలబడి కృశ్చనింగ్ చేస్తున్నాడొక టక్కిస్ట్. మరో ఇద్దరు అతన్లాగే యూనిఫాం వేసుకొని గోల్కొండ కోటకున్న బురుజుల్లా

నిలబడి ఉన్నారతని పక్కన. వేదిక వెనక, షామియానా లకంతటా అతికించబడి ఉన్నాయి బోల్డు ఫ్లెక్సీలు.

వాటన్నింటిపైనా ఒకే ఒక వాక్యం రాయబడి ఉందిలా.

''థమ్సే డౌన్ నే తాగండి! లైఫ్‌లో అప్ కండి!''

రికార్డింగ్ వాయిస్‌లా ''మా రికార్డ్‌ని బ్రేక్ చేయాలనుకుంటున్నారా?'' అంటున్నాడతను మళ్ళీ.

''ఆఫ్ట్రాల్ 'బ్రేకొకటే కాదు. ''కథక్'', ''కసక్'' అన్నీ చేసేయాలనుకుంటున్నాను.

మీకేమైనా అభ్యంతరమా? గోపాలం అత్యుత్సాహం ప్రదర్శిస్తూ ముందుకురికొచ్చాడు.

గోపాలం దూకుడుకి భయపడిన ఆ టక్కిస్ట్ ''హబ్బే! అలాంటిదేంలేద'ని గొర్రెలా తలూపి గోపాలాన్ని వేదిక పైకి రమ్మని సైగ చేశాడు.

''ఏం చేయాలి?'' వేదికనెక్కి ప్రశ్నించాడు.

''రికార్డ్‌ని బద్దలు చేయాలి.''

''బద్దలు చేయాల్సింది రికార్డ్‌నా? మీ 'థమ్సే డౌన్' సీసాని కాదా?''

''మా బుజ్జీ...మా మైసూర్ బజ్జీ, మా మిరపకాయ బజ్జీ...''

''సర్. మీ రికార్డ్ గుట్టేంటో విప్పండి.''

''ఎంత తక్కువ టైమ్‌లో మా వన్ లీటర్ కూల్‌డ్రింక్‌ని తాగగలిగితే అంత రికార్డ్ మీ సొంతమవుతుంది.''

''తాగలేకపోతే...''

''ఈ బాటిల్ బిల్లు మీదవుతుంది.''

''ఓ ఐసీ! ఇదో మెలికుందా? అందుకే కొందరు జంకుతున్నారన్నమాట.'' అనుకున్నాడు.

భద్రంగా వాళ్ళందించిన బాటిల్‌ని అంతే భద్రంగా పైకెత్తి 'స్టార్ట్'నగానే గడగడా తాగేసాడు. పుట్టిబుద్దెరిగి కూల్‌డ్రింక్ తాగని వాడిలా ఆబగా ఒకే ఒక గుక్కలో.

కంపెనీ త్రిమూర్తులు ఒహాటే చప్పట్లు.

''ముప్ఫై సెకన్లలో గుటుక్కుమని తాగేసి గతంలోని కంపెనీ రికార్డ్‌ని బద్దలు... కాదు కాదు... ముక్కలు ముక్కలు చేశారు.'' అంటూ గోపాలం చేయి పుచ్చుకొని ముగ్గురూ ఒకేసారి షేక్ చేశారు.

ఆ షేక్‌కి మనవాడు షాకయ్యాడు. చెయ్యండి చేతికొచ్చినట్టు అన్పించి 'వామ్మో' అని అరవబోయి ఎడం చేత్తో నోరు నొక్కేసుకున్నాడు.

అప్పుడడిగాడో డౌట్ గుంపులో గోవిందయ్య.

''మీ డ్రింక్‌లో పురుగులమందు కలుపుతారని ఓపెన్ టాక్ వుంది. నిఝమా?''

''మీరన్నది వెయ్యి శాతం... నమ్మకపోతే... మిలియన్ శాతం... నిఝమే!'' హాపీగా జవాబిచ్చారు.

అది విన్న గోపాలం కళ్ళు తేలేసాడు. కడుపులో దేవినట్టయ్యింది. లోపలకు దిగింది కాస్తా పుటుక్కున గొంతులోకి చిమ్మింది ఫౌంటేన్‌లా.

''కాదంటారనుకుంటే ఔనన్నారేం?'' ఎలాగోలా గొంతు పెగిలింది గోపాలానికి.

''ఉన్నది లేనట్టు, లేనిది ఉన్నట్టు... ఛీఛీ ఉన్నది ఉన్నట్టు చెప్పడం మాకలవాటు, మా కంపెనీ డ్రింకు తరచూ తాగడంవలన మేం కలిపిన అయిదు రకాల పురుగుల మందులు మీ వంట్లో కలిసిపోయి... రేప్పొద్దున ఏ పురుగైనా మిమ్మల్ని కరిచినా, కుట్టినా, కొరికినా మీకెలాంటి విషం ఎక్కదన్నమాట...''

పూర్తవలేదింకా.

''ఏంటీ. అయిదు రకాల పురుగుల మందులు కలుపుతారా? ఈ విషయం తాగకముందు చెప్పాల్సింది.'' పిల్లి కూతలా వచ్చింది గోపాలం గొంతు.

''అవును మరి.'' సగర్వంగా చెప్పారు వాళ్ళు.

''ఏంటో అవి'' తాము తాగినందుకు కితకితలు పెట్టినట్టు నవ్వుతూ అరిచారు గొంపులోంచి కొందరు.

''ఈగ, దోమ, స్పైడర్, బొద్దింక, ఎలుకల మందులన్నమాట.''

భళ్ళున వాంతి చేసేస్కున్నారు గోపాలం. కంటిన్యూ పాలసెస్‌లా ''యాక్! యాక్!''మని అదే పనిగా డోక్కోసాగాడు.

కంపెనీ వాళ్ళు జాలిగా లుక్కేసారతని వంక.

⁂

చచ్చుపుచ్చువి తప్ప నిఝమైన రికార్డ్‌లు తనవల్ల అయ్యేపని కాదని ఎవరైనా ఉత్త పుణ్యానికి సన్మానాలు గట్రా ఘనంగా చేస్తే బావుండునని థింక్ చేసాడు.

అతడి ఆలోచన కార్యరూపం దాల్చినట్టే...

''మొహంవాచి ఉన్నారు? సన్మానాలకు! సత్కారాలకు! అధైర్యపడకండి. మీకోసమే మేమున్నాం! ఆలసించకండి. రండ్రండి...''

పేపర్లో పెద్దక్షరాలతో ప్రకటన చూసి ఆ అడ్రస్ వెతుక్కుంటూ వెళ్ళాడు. వీల్ ఛైర్లో గడకర్ర వంగినట్టు కూర్చొని ఉన్నాడొక బొద్దుమీసాల పెద్దాయన.

అతి వినయంగా నమస్కారంపెట్టి ఎదురుగా కూర్చున్నాడు గోపాలం.

''మీ పేరేంటన్నార్?'' అడిగాడు గోపాలం.

''విశాఖపట్నం'' అంటూ పళ్ళికిలించాడు.

ఆ పనికి బ్రేకిచ్చి ''తమరి పేరు?'' గోపాలాన్ని ప్రశ్నించాడు.

''విజయవాడ'' బదులిచ్చాడు గోప్స్. తిక్క రేగిందతనికి.

''ఎకసెక్కాలా?'' గుర్రుగా చూశాడతను.

''వెటకారమెంత మాత్రం కాదండీ!''

''అలాగైతే మీ నాన్నగారి పేరేంటో చెప్పుకోండి చూద్దాం?''

''ముందు మీరే సెలవీయండీ.''

''నా నోటికి నో సెలవులు, నో హాలిడేస్, మా నాన్న భద్రాచలం.''

''అవునా? భలే భలే... మా ఫాదర్ సేమ్‌టు యూ శ్రీశైలం.'' సర్రుమందవతలి క్యారెక్టర్‌కి.

బుర్ర బర్రున గోక్కొని ఈ డంప్ డైలాగ్సెందుగ్గానీ.. కామెడీ మాని కమిట్‌మెంట్‌కొద్దాం. నా నేమ్ ఉచితానందం.''

''మరదే నాకక్కడే చిరుగుద్ది. నా నిజ నేమ్ గోపాలం.''

''పాయింట్‌కొద్దాం.''

''ఏంటా బూతు?'' కంగారు పడిపోయాడు గోపాలం.

''భలే వాడివయ్యా మగడా! పాయింటంటే ఇక్కడ ''షర్టు- పాయింటని కాదు. విషయానికొద్దామని...'' నుదురు చరుచుకున్నాడు ఉచితానందం. గోపాలం భాషా పైత్యానికి!

''హడలి చచ్చాననుకోండి.''

''చెప్పండి. మీకారేంజ్‌లో సన్మానం జరగాలి.''

''అట్టహాసంగా జరిగితే దాన్ని పేపర్లూ రాసుకుంటాయి. టీవీ ఛానళ్ళు చూపుకుంటాయి.''

''ముందు రేట్లు వినండి. వంద మంది సమక్షంలో అయిదువేలు, రెండొందలకు పది, మూడొందలకు పదిహేను, నాల్గొందలకు ఇరవై, అయిదు ప్లస్సయితే పాతికవేలవుద్ది. బోనస్‌గా మంత్రిగారిచేతే ఘన సన్మానం.'' మెనూకార్డు తీసి పట్టికంతా చదివాడు.

గోపాలం బుర్ర తడుముకొని ''ఎంతయినా మంత్రి చేతులమీదుగా జరిగే సన్మానమే సన్మానం మరి... పాతిక్కే ఖాయంచేస్కోండి.'' అన్నాడు అమితానందంతో.

మా కంపెనీ డ్రింకు తరచూ తాగడంవలన మేం కలిపిన అయిదు రకాల పురుగుల మందులు మీ వంట్లో కలిసిపోయి... రేప్పొద్దున ఏ పురుగైనా మిమ్మల్ని కరిచినా, కుట్టినా, కొరికినా మీకెలాంటి విషం ఎక్కదన్నమాట...''

''తమరిష్టం.''

''ఎమౌంట్ మరిచిపొండి. సన్మానం జరిగిన ఉత్తర క్షణం మీ ఒడిలో పోస్తా.''

''హబ్బే! ఉత్తర, దక్షిణ క్షణాల్దాకా ఎందుకు, వచ్చే జన్మలో కూడా మా సంస్థనుండి సన్మానం జరుపుకొని అప్పుడిద్దురుగాని లెండి. ఇది, అది కలగలుపుకొని,'' పళ్ళు పటపట లాడించాడు ఉచితానందం.

'పేరులో మాత్రమే 'ఉచితం' ఉన్నట్టుంది. మిగతాదంతా 'ఖచ్చితమేనన్నమాట''అనీ అననట్టని నాలిక్కొరుక్కుంటూ ''పోన్లెండి. మీమాటే కానీయండి'! అడ్వాన్స్‌గా హాఫ్... పనయ్యాక మిగతా హాఫ్ కాస్తా.'' భరోసా ఇచ్చాడు గోపాలం.

''ఏంటి ఇచ్చేరు? తుంగలో భంగా! కుదర్దు. మొత్తం ఒకేసారి అడ్వాన్స్‌గా అదీ క్యాష్ పేమెంట్ చేసేయాలి.''

''మరికొంత డిస్కౌంటిస్తారా?'' ఆశగా అడిగాడు.

''ఇస్తాం. పది దండలకు బదులు అయిదు... ప్రశంసా పత్రం... వగైరాలన్నీ... కట్! కట్!... ఓకేనా?''

గోలం కళ్ళు మిటకరించి ''అంత పని చేయండి, లేక లేక సన్మానం. ఇదేకదా నా ఫస్ట్ సత్కారం.'' అన్చెప్పి మర్నాడొచ్చి పాతికవేలు మల్లెపూవుల్లో పెట్టి సమర్పించాడు, సన్మానం రోజుకోసం ఆత్రంగా ఎదురు చూడసాగాడు.

⁂

వారం గడిచాక గోపాలానికి పోస్ట్‌లో కవరొచ్చింది. మున్సిపల్ హాల్లో సన్మానం. రెండ్రోజుల్లోనే సన్మానం. టైమ్ దగ్గరపడ్తోంది. వాడంతా ఠాంఠాం చేస్కున్నాడు. ఆఫీసంతా మెగా పబ్లిసిటీ ఇచ్చుకున్నాడు. తన సన్మాన కార్యక్రమానికి అటెండయిన కొలీగ్స్‌కి, మిత్రులకి, నైబర్స్‌కి మంచి పార్టీ ఇస్తానని ఆశచూపి అందర్నీ మూటకట్టుకొని మినీ బస్ అరెంజ్ చేశాడు.

రాజువెడలె రవి తేజములొలక అన్నట్టుగా అందర్నీ వేసుకొని అక్కడికెళితే ఏముంది? మున్సిపల్ హాల్‌కి వేలాడుతున్న తాళం వెక్కిరిస్తూ కన్పించింది. వాచ్‌మెన్‌ని ఎంక్వయిరీ చేస్తే హాలు రిపేర్‌లో ఉంది అద్దెకివ్వడం లేదన్న కబురు చల్లగా చెప్పాడు.

గోపాలం మొహం చూడాలి... అప్పడం అప్పడం అయిపోయి... రెండు డ్రమ్ముల కన్నీరు కార్చేసాడు. ఎంత వెతికినా ఉచితానందమే కాదు ఆఫీసు కూడా అయిపూ అడ్రస్ లేకుండాపోయింది!

⁂

''పోయినచోటే వెతుక్కోవాలన్న సత్యం బాగా ఒంటబట్టినట్టుంది గోపాలానికి. సన్మానాలు- సత్కారాల బ్యూరో అనే ఫ్లెక్సీ తగిలించేసి రాత్రికి రాత్రే సొంతంగా తనే ఓ ఆఫీసు ఓపెన్ చేశాడు.

'ఇంట గెలిచి రచ్చగెలవాల'న్నట్లుగా ఇది గనక క్లిక్కయితే వరల్డ్ వెబ్‌సైట్ కూడా ఓపెన్ చేయాలని భారీగా తలపోస్తున్నాడు. మోసానికి నో ఛాన్స్! అన్నది అతనికి నినాదం, తథాస్తు!

అయాచిత సన్మానాలు, సత్కారాలు ఆశించి మహానుభావులకింకేం? జయహో! ★

**రచయిత చిరునామా:**
ఎనుగంటి వేణుగోపాల్,
ఇ.నెం.1-3-168/1, కృష్ణానగర్, జగిత్యాల- 505327.
కరీంనగర్ జిల్లా.